# కుట్ర

## కుప్పిరెడ్డి పద్మనాభరెడ్డి

గొప్ప వాళ్ళ యింటి ముందు, "కుక్కలున్నాయి జాగ్రత్త" బోర్డులాగా రోడ్డు ఆ యింటిని అంటి పెట్టుకొని వుంది. పుర ప్రముఖులైన కనక నిచ్చెనల సుబ్బారావు గారి యింటి ముందున్న రోడ్డు అట్లా వొదిగి వుండటం ఎంతేనా సమంజసమే నని చెప్పక తప్పదు. మునిసిపల్ ఛేర్మెన్‌గా గత యేడేళ్లుగా యెటు తెరపి లేకుండా వారు చేస్తోన్న ప్రజాసేవకు తార్కాణంగా రోడ్డుకైనా ఆమాత్రం కృతజ్ఞత అవసరమే మరి. అధికారం వుంది గాదా అని సుబ్బారావు గారున్నూ, వారి ఆశీస్సులు వున్నాయి గదా అని సన్న బియ్యం కన్నయ్య గారున్నూ రోడ్డు మీద యిల్లు కట్టేసుకున్నారని గిట్టని వాళ్ళంటారు కానీ ఆ ఆరోపణను యే కోర్టూ రుజువు చేయలేక పోయింది. లంకంత యిల్లు రోడ్డు మీద కట్టేరంటే కవి హృదయం అర్థం చేసుకోగలదు కానీ కోర్టు హృదయం అర్థం చేసుకోగలదా?

అది ఫలానా వేళా విశేష మనడానికి వీల్లేదు గానీ వారు యిల్లు అక్కడ తయారించిన దరిమిలా ఆ రోడ్డంట వెళ్ళే లారీ, బస్సు డ్రైవర్లలో నిర్లక్ష్యం పేట్రేగి పోయింది. మూడేసి నెలలకు వో సన్నపాటి యాక్సిడెంటూ, సంవత్సరానికొక్కటైనా వోలావు పాటి యాక్సిడెంటు చేయడం వాళ్ళు విధిగా పెట్టుకున్నారు. ఇదుగో యీ మూణ్ణెల్లూ డ్రైవర్లు వాళ్ళు దగ్గర పెట్టుకొని బళ్ళు నడిపేరని సంతోషించ బోయేలోగానే, ఛేర్మెన్ గారి లోగిల్లో యెక్కడో విహరిస్తోన్న దున్నపోతును, ఎ. పి. డి. 2848 లారీ డ్రైవరు కుట్రపన్ని, రోడ్డుపైకి లాక్కొచ్చి, లారీ కిందకు తోసేశాడు. ఆ పూట ఛేర్మెన్ గారు యింటి పట్టునే వున్నారు వారి ప్రాపకంలోని వొక్కగా నొక్క దున్నపోతు చావుకే వారు యెంత తల్లకిందులయ్యారో, వారి దుఃఖాన్ని చూచిన వాళ్ళకు తప్ప మరోవాళ్ళకు అర్థం కాదు. రెండు వేలు ఖరీదు చేసే సదరు జీవికి (మరి ఛేర్మెన్ దున్న ఆమాత్రం చేయదా) నాలుగు వేల రూపాయలు పరిహారం ముట్టినా వారు దుఃఖించడం మానలేదు. మరో రెండు వేలు దానికి కలిసాక కానీ వారు దుఃఖాతిరేకాన్ని వో రకంగా




నిభాయించుకోలేకపోయారు.

యీలోగా యితరుల యిబ్బందులను సొమ్ము చేసుకునే అవకాశవాదులు కొందరు యిట్లాంటి ప్రమాదాల్ని అడ్డు పెట్టుకొని ఛైర్మెన్ గారిని దెబ్బ తీయడానికి వొక బృహత్పథకం వేసేరు. ఛైర్మెన్‌గారి యింటి మీదుగా పోయేరోడ్డు పెద్ద బాడీ బండ్లు పోవడానికి అనువుగా లేదనీ, అంచేత మళ్ళింపు రోడ్డు వొకదాన్ని వేయించాలని ప్లాను గీయించి మహజర్లు పంపుకున్నారు ప్రభుత్వానికి. అయితే యీ రాజకీయ కుట్రను ఛైర్మెన్ గారు యే మాత్రం నిర్లక్ష్యం చేయలేదు. ఛైర్మెన్‌గారి యింటి ముందున్న రోడ్డుగారి పలుకుబడి తగ్గిందంటే ఛైర్మెన్‌గారి పలుకుబడి కూడా తగ్గినట్లేకదా! అంచేత వారు తమ ప్రతిభా విశేషాదులనుపయోగించి, సదరు ప్రతిశక్తుల కుట్రను సకాలంలో యెదుర్కొని, విశాలమైన ఛైర్మెన్‌గారి యింటి ముందటి రోడ్డును((యిక్కడ అన్వయ క్లిష్టత వుందనడం న్యాయంకాదు, వైశాల్యం నమ్మకంగా ఛైర్మెన్ గారిదే, రోడ్డు గారిది కాదు) మించిన రోడ్డు యిండియాలోనే లేదనిపించేరు. అంతటి శక్తి సముద్రులైన ఛైర్మెన్‌గారు ఆరోజు వొక జీవనదిని తమలో కలిపేసుకోనే మహాత్కార్యం సంకల్పించేరు. సన్న బియ్యం కన్నయ్యగారి షడ్డకుడున్నూ, మొన్న మొన్నటి దాకా తన ప్రత్యర్థి దొంతి కుండల కొండారెడ్డి కుడి భుజంగా పేరుకెక్కిన వాడున్నూ, పదిహేను లక్షలకు తలవంచని తెల్లని ధనాన్ని కేవలం యిద్దరు నల్ల కూతుళ్ళ వెచ్చాల నిమిత్తం వృద్ధిచేస్తున్న వాడున్నూ అయిన ఆసుమాను రామయ్యగారి రెండో కూతుర్ని తన మూడో కొడుక్కు ముడెయ్యడం ద్వారా శత్రు సంక్షేపణం, ధన నిక్షేపణం సాధించదలచేరు.

తెల్లవారితే ముహూర్తం. వచ్చే జనం, పోయే జనం. ముసిరే ఈగా; కొసిరే కాకీ. మొరిగే కుక్కా; యెగిరే విస్తరి, మోసేయెద్దూ: పనులన్నీ సజావుగానే జరుగుతోన్నట్లున్నా, ఛైర్మెన్‌గారు పురుముతూనే వున్నారు. పురుము పురుముకూ యెవరో ఒకరు ఉలిక్కిపడి పరుగెడుతూనే వున్నారు యెందరు పరుగెత్తినా యింకా కొందరు పరుగెడితే కానీ పని జరగదన్నట్లు కన్నయ్యగారు హడావిడి చేస్తునేవున్నారు. వూళ్లో నీళ్ళ రేషనంటే మాత్రం ఛైర్మెన్ గారింటికి రేషనంటే కుదురుతుందా అని పంపుతున్నారు. యిరవై తొమ్మిది డ్రమ్ములకు నీళ్లోసి, ముప్పైవయ్యో దాన్ని ఖాళీగా వొదిలేసి నందుకు, నీళ్ళకూ డ్రమ్ములకూ సంబంధం లేనివాడి నెవడినో పట్టుకొని దులిపేస్తున్నాడు. దులపరింపు పాకాన పడినపుడల్లా తన అధారిటీకి తానే పరవశించిపోయి సకిలిస్తున్నాడు.

ఛైర్మెన్‌గారి పెద్ద కూతురూ, పెద్ద కోడలూ వోవేపూ, కన్నయ్యగారి కోడలూ, భార్యా మరోవేపూ, గంట గంటకూ చీరెలు మారుస్తూ, నగలు మెరిపిస్తూ ఫ్యాషన్ పెరేడ్‌లో మోడల్స్‌కు మల్లే పడుతూ, లేస్తూ, నడుస్తున్నారు. మా మూలు రోజుల్లో యింటి యీ చివర్నుండి ఆ చివరకు ఆగకుండా నడిస్తే చాలు, ఆయాస పడిపోయే శరీరాలవి. అయినా ఆయాస మనుకుని హడావిడి మానుకుంటారా? హవ్వ! అప్రతిష్ట కాదూ! చీరెలూ, నగలూ, ఆ మాత్రం వగలూ కురిపించక పోతే "అదేం పెళ్ళి?" అని అలాగా జనం నోళ్ళు పడిపోయేలా నొక్కుకోరూ?

ఛైర్మెన్‌గారి పురుములకూ, ఆడవాళ్ళ పరువులకూ అడ్డుపడుతూ పది పన్నెండు మంది కుర్రాళ్ళు యింటి ముందు పందిరి పీకి మరో యిళ్ళువేసే సందడిలో వున్నారు. అంతా అయిదారేళ్ళు దాటని బాపతే. అయితేనేం. అల్లరిడోసూ, మురిపెండోసూ అహండోసూ, అయిస్క్రీం డోసూ, కిండర్ గార్టెన్‌డోసూ నషాళం అంటినవాళ్ళే.




అరటి బోదెను హాకీ స్టిక్కుగా మార్చే ప్రయత్నంలో వున్న వాడొకడూ, పంది రెక్క పాకుతూ, తూలుతూ వుండే బస్తీమే సవాల్ కళాకారు డొకడూ, పోతే యిద్దరు బౌలర్లూ, యిద్దరు బాట్స్‌మెన్ క్రికెట్‌లో పీకెలదాకా మునిగివున్నారు. వాళ్ళ అంపైర్లిద్దరూ యింకాస్తా ముందుకుపోయి క్రికెట్ రూల్స్‌మీద జుట్టూ జుట్టూ పట్టుకోవడంలో నిమగ్నులై వున్నారు. వీళ్ళందరికీ అతీతంగా ఛేర్మన్‌గారి మనుమడూ, కన్నయ్యగారి మనుమడూ పందిరిముందు వొత్తుగా పరిచిన యిసుకలో పోటీలుపడి వొహార్లోనెహారు సన్మానించేసు కుంటున్నారు.

వాళ్ళకు కొంచెం యెడంగా, గేటుకు అటుగా వోమూల చెత్త కుండీకి దగ్గరగా, వాళ్ళ యీడువాడే, వాళ్ళనెవళ్ళనూ ఖాతరు చేయడానికి పురసత్తు లేనంత బిజీగా వున్నాడు. యెవరో దానంచేసిన రెడీమేడు లాగూ, నిక్కరులో వున్నాడులా వుంది, యెంగిలి విస్తళ్లగంప వొకవేపూ, వొకచిన్న బుట్ట మరోవేపూ పెట్టుకొని దీక్షగా పనిచేసు కుంటున్నాడు, విస్తళ్ళలోంచి మైసూరుపాకు తుంపులూ, లడ్డు ముక్కలూ, వడలూ, యేరి బుట్టలో విడి విడిగా పెట్టుకుంటున్నాడు. వాడికేసీ విస్తళ్ళకేసీ రెండు వూరకుక్కలు కసిగా' అక్కసుగా, ఆశగా, దయనీయంగా చూస్తున్నాయి. అవి అప్పటికే వాడిరాళ్ళ దెబ్బలు విరివిగా రుచి చూడ్డంమూలాన దగ్గరకు రాకుండా తగు జాగ్రత్తలో వుండే యెంగిలాకులపై వాడి నియంతృత్వాధికారాన్ని సవాలు చేస్తున్నాయి. వాడు వాటిని వోకంట కనిపెడుతూనే చకచకా పనిచేసుకు పోతున్నాడు.

వాడికీ ఆపెళ్ళికీ యేకోశానా సంబంధం లేదు. యెంగిలాకులకూ, వాడికీ అంతకన్నా అనుబంధంలేదు. ఆమాటకొస్తే మన తాత ముత్తాతల కాలంనుండీ, యింకా అంతకు ముందునుండి గూడా వంశపారంపర్యంగా యెంగిలాకుల్ని అనుభవించే హక్కు కేవలం కుక్కలకే వుంది. మన

ర్మశాస్త్రాలూ, స్మృతులూ, పురాణాలూ కన్నీ యీహక్కును సమర్థిస్తూనేవున్నాయి ఫలి ప్రభావం వల్ల యిప్పట్లో మెజారిటీ మనుషులకూ, ఊరకుక్కలకూ అట్టే తేడా లేదని సామ్యం తెచ్చినా, ఆ యెంగిలాకుల మీద వారికి యెంత నైతికమైన హక్కుందో, వూర కుక్కలకూ, అంతే హక్కు వుండాలి గదా? అయితే హక్కులను భుజాన వేసుకొని వూరేగినంత మాత్రాన యేదైనా వొరగబడుతుందనే భ్రమ వుంటే—సదరు వూరకుక్కల భ్రమ—ఈ దృశ్యంతో కడతేరివుండాలి. వున్న తిరకాసల్లా [illegible]మ అమ్మ చేర్మెన్ గారింట్లో పనిమనిషి పదవైనా చేబట్టక పోవడంలో వుంది, అని వాటికి అర్థం అయివుండాలి. వూరకుక్కలు అమ్మ అంతటి అదృష్టానికి నోచుకోలేదు. వాడి అమ్మ ఆ దురదృష్టాన్నుండి యిప్పుడప్పుడే తప్పించుకోనూ లేదు.

చేర్మెన్‌గారి పురుముల్లోంచీ, కన్నయ్యగారి సకిలింపుల్లోంచి, ఆ దా ఫ్యాషన్ పెరేడ్‌లోంచీ, కుర్రాళ్ళ క్రికెట్‌లోంచీ దారి చేసుకుంటూ అచ్చోసిన ఆవులా అటూయిటూ యేదో మోస్తూనో, తీస్తూనో, తెస్తూనో, ఆ సంకుల వివాహ రంగంలో, యిందుగల దందుగలదనిపిస్తోన్న సంగి వాడి అమ్మ. ఆమె మునిసిపల్ ఆఫీసు ప్యూను పెళ్ళాం. వాడు ఆఫీసులో ప్యూనయితే, యిది చేర్మెన్ గారింట్లో ప్యూను. చేర్మెన్ గారింట్లో అందరూ తినగా తినగా తినగా మిగిలిన తిండీ, అందరూ కట్టగా, కట్టగా కట్టగా విసుగెత్తి పారేసిన గుడ్డా దాని జీతం. అయినా అది తెలివిగా ఆ రెంటినీ డబ్బు చేసుకుంటూనే వుంది. తిండి మిగిలినరోజు, రిక్షావాళ్ళకూ, ఫ్యాక్టరీ కూలీలకు అన్నం ముద్దలు అమ్మి కాకా హోటల్ కాశింగాడికి చేరేస్తుంది. మరి కాస్తా గట్టిగుడ్డ చేతికి వచ్చినరోజు రాజుగాడి సెకండ్ హేండ్ గుడ్డల దుకాణానికి అమ్మేస్తుంది. అట్లా అది యిప్పుడు రెండొందల దాకా పాతరేసి వుంచింది. ఆడబ్బుతో చాలా చాలా చేయాలని దాని ఆశ. వాటిల్లో కొడుకు వెంకట్రావుడ్ని పెద్ద చదువులు చదివించాలనే ఆశ మిగిలిన ఆశల్ని జయించడంవలన ఆ రెండొందలూ యింకా మిగిలేవున్నాయి.

పెళ్ళికి చేర్మెన్‌గారు దానికో చీరె, రవికె దయచేశారు వెంకట్రావుడికూడా వోలాగూ, చెడ్డీ తీయించేరు కొత్త చీరా, రవికెల్లోనే అది పెళ్ళింట్లో నానా హైరానా పడుతోంది. వెంకట్రావుడు మాత్రం చేర్మెన్ గారి పెద్దకూతురు తన కొడుక్కు బిగుతుగా వున్నాయని దయచేసిన రెడీమేడ్ డ్రెస్సులో వున్నాడు.

సంగి హడావిడికి యివ్వాళ ఓ ప్రత్యేకత కూడా వుంది. అది కాకా హోటల్ కాశింగాడితో ముందుగనే వొప్పందం చేసుకొని వచ్చింది. యెప్పటి సరుకును అప్పుడు తాజాగా వాడికి బదిలీచేయించే యేర్పాటు కూడా చేసింది. అందుకే అది గుంటవెధవ వెంకట్రావుడ్నిగూడా ముగ్గులోకి దించింది. యీ రెండ్రోజులు యింకాస్త అదనంగా వొళ్ళు హూనం చేసుకుంటే దానికి మామూలు యీనాంలేకాక; కాకా కాశింగాడి ద్వారా పాతికా, ముప్ఫై పైచిలుకు రాబట్టుకునే దారి యేర్పడింది. అందుకే అది పెద్ద చదువులు చదివించేదలచిన వెంకట్రావుడ్ని చెత్తకుండీ పక్కన యెంగిలాకులు దేవుళ్ళాడ్డానికి కేటాయించింది. కుక్కల మధ్య, యెంగిలాకులమధ్య ఈగలమధ్య, కంపోస్టు మధ్య వెంకట్రావుడ్ని చూసి దాని కడుపుదేవేసినట్లయినా ఈ రెండ్రోజులేగా— అని సర్దిచెప్పుకుంది—

ఇసుక సన్మానాలకు విసిగి, క్రికెట్ టీముతో బెడిసి, పంది గెక్కబోయి పళ్ళురాలగొట్టుకొని, యింకేం చేయాలో దిక్కుతోచని నికృష్టస్థితిలో విశాల ప్రపంచం మీదికి దృష్టి సారించిన చేర్మెన్‌గారి మనుమడు, హఠాత్తుగా మూడు కె. జి. బి. కుట్రలూ, ముప్ఫై సి. ఐ. ఎ. కుట్రలూ. వొక్కసారిగా కళ్ళకు కట్టినట్టయి టకీమని

లేచి నించున్నాడు. వాడు ముమ్మూర్తులా తాతలాగే వుంటాడని యింటిల్లిపాదీ మురిసిపోతుంటారు. వాడు మహా గంభీరంగా అడుగులో అడుగు వేసుకుంటూ గేటు దాకా వెళ్ళి గోడవానుకొని వెంకట్రావుడి కుట్రను నిశితంగా పరిశీలించడం మొదలెట్టేడు.

అప్పటికి వెంకట్రావుడు మొదటి లోడు కాకా ఖాళీంకు దఖలుపరిచివచ్చి; వాడి అమ్మ అందించిన రెండో యెంగిలాకుల బుట్టను సర్దుకుంటున్నాడు. వాడు వచ్చే దాకా చెత్తకుండీలో ఆకుల్ని కెలికి కెలికి, యేమీదొరక్క విసుక్కుంటోన్న కుక్కలు వెంకట్రావుడి చేతిలోని యెంగిలి విస్తళ్ళ గంపను చూసి తమ పాత యెత్తుగడను టకీమని మార్చేశాయి. అప్పుడే పదవీస్వీకారం చేసి విచ్చేసిన మంత్రివర్యుల్ని ఆప్యాయంగా పలకరించే ఆప్తవర్గంలాగా తోకలాడిస్తూ పక్కకు వొదిగినించున్నాయి. ఛేర్మెన్‌గారి యింటిచుట్టూ వుండే కుక్కలవడంమ్మూలాన ఆ మాత్రం లౌక్యం వాటికబ్బడంలో అబుర్బపడాల్సిందేమీ లేదు. కానీ వెంకట్రావుడి గుణం వాటికి బొత్తుగా తెలీదల్లే వుంది. వాడు తనకు దక్కినవాటిలో భగవంతుడిగ్గూడా చచ్చి గీపెట్టినా వాటా యివ్వడు గాక యివ్వడు. వొక్క నాలుగురాళ్ళతో కుక్కల్ని చేణివేటు దూరానికితోలేసి విస్తళ్ళ వేర్పాటు వుద్యమంలో నిమగ్నుడయేడు వాడు. యీషన్మాత్రపు రాజీ ధోరణినైనా చూపెట్టని వాడికేసి కుక్కలు కాసేపు గుర్రుగా చూసి, దరిమిలా చూడ్డంగూడా దండగనుకొని, వియత్నాంలో అమెరికావాడు తోకముడిచినట్లుగా ముడుచుకొని వెళ్ళిపోయాయి.


ఛేర్మెన్‌గారి మనవడికి వెంకట్రావుడ్ని కుక్కలు సంభావించిన తీరు మహాద్భుతంగా వుంది. వాడికి వూర కుక్కలంటే మా చెడ్డ భయం. అట్లా అవస్థలో వాడు వుండగా, కేవలం పనిమనిషి కొడుకు కుక్కల వ్యూహంలోకి జొరబడి, నాలుగే నాలుగు రాళ్ళతో వాటిని తరిమేశాడంటే తమ యింటో పని చేసేదాని కొడుక్కు తనకు మించిన ధైర్య సాహసాలుండడం వాడికి తల వంపులుగా వుంది. తనను అవమానించిన కుక్కల్ని అవమానించిన వెంకట్రావుడ్ని అగుడు పట్టించి కుక్కల మీది పగా, వాడి మీద ద్వేషమూ తీర్చేసుకోవాలని వాడు తీర్మానించుకున్నాడు. వెంకట్రావుడు తమ పని మనిషి కొడుకు కాబట్టి వాడిని అగుడు పట్టించడం కంటే తేలికైన పని మరోటి లేదని వాడికి నొకరు చెప్పఖ్ఖర్లేదు మరి.

అభ్యుదయ పరం పరాభివృద్ధిగా తాను చేపట్టిన మహా కార్యాన్ని చూడ్డానికీ, ఆనందించడానికే, యితర్లకు వివరించడానికీ కనీసం ఒక్క ప్రేక్షకుడైనా లేకపోవడం వాడికి వెలితిగా తోచింది. చుట్టూ చూసి నీళ్ళ డ్రమ్ముల మధ్య దాగుడుమూతలాడుకుంటున్న కన్నయ్య మనవడిని వొడిసి పట్టుకున్నాడు. 'యెక్కడికిరా?' అని వాడు గోల పెడుతోన్నా, సరాసరి వెంకట్రావుడి ముందొచ్చి ఆగేదాకా ఛేర్మెన్‌గారి మనువడు వాడి చెయ్యి వొదిలేదు కాదు. అయితే విస్తళ్ళ—యెంగిళ్ల వేర్పాటు ఉద్యమంలో మునగానాం తేలానాంగా వున్న వెంకట్రావుడు వీళ్ళద్దర్ని కీలగానైనా గమనించనే లేదు.

తన్ను చూడగానే జడుసుకుంటాడనుకున్న వెంకట్రావుడు నిమ్మకు నీరెత్తినట్లుగావుండిపోయేసరికి భగ్గుమంది ఛేర్మెన్‌గారి మనవడికి.

"ఏయ్! ఏంచేస్తున్నావ్?" అన్నాడు జబర్దస్తీగా యెంగిలాకుల గంపను కాలితో నెట్టుతూ.

వెంకట్రావుడు యిలాంటి అనూహ్యమైన దాడులకు సిద్ధంగానే వున్నట్లుంది. అసంకల్పితంగా వో చేత్తో బుట్టనూ, మరో చేత్తో వో రాయినీ పట్టుకొని తలెత్తి చూసేడు. యెర్రటి వాడిచూపులో మసక




మసగ్గా కనిపించేడు ఛేర్మెన్‌గారి మనవడు. భయమేమీ లేదనుకున్నాడో యేమో రాయిని వొదిలేశాడు.

తాపీగా "యెంగిళ్ళు యేరుకుంటున్నా" అన్నాడు.

ఛేర్మెన్‌గారి మనవడికి వొళ్ళు మండింది. యింత భయం భక్తీ లేని జవాబా?

"అవి మవి. యిల్లాతే!" అన్నాడు రబ్బసంగా.

"యివ్వను."

"యిస్తావా? యివ్వవా?"

"బుట్టను తగిలితే మర్యాద దక్కదు" అన్నాడు వెంకట్రావుడు కరుగ్గా.

ఛేర్మెన్‌గారి మనవడు అవిధేయతను యిక యెంత మాత్రం సహించలేకపోయాడు. "యేం? తంతావా?" అంటూ బుట్టను మునివేళ్లతో తగిలేడు.

వెంకట్రావుడు యిహ తాత్సారం చెయ్యలేదు. ఛేర్మెన్‌గారి మనవడిని గురిచూచి ముఖంమీద గుద్దేడు. వాడి చేతులకు అందకుండా బుట్టను యెదురుకొని గురిడెలకు పొత్తుకున్నాడు. వొకేవొక్క క్షణం యెంగిలాకులగంపలో యింకా మిగిలివున్న పదార్థాలకేసి చూసేడు. యిహ ఆలస్యం చేస్తే తన బుట్టలోనివి గూడా దక్కవనుకొని రోడ్డుకు అడ్డంపడి చువ్వలా దూసుకుపోయేడు. అతిదగ్గర్లో వినిపిస్తున్న మోటారు హారన్‌నూ, హెడ్‌లైట్ల కాంతిని లెక్కచెయ్యకుండా.

వెంకట్రావు దెబ్బకు ఛేర్మెన్‌గారి మనవడి అహం పదింతలైంది. "రేయ్! యెక్కడకు పోతావురా రాస్కెల్!" అని రోడ్డు మీదికి లంఘించాడు.

క్షణాల తర్వాత ఛేర్మెన్‌గారి యింట్లో పెళ్ళి సందడిని మించిన గొంతుల్లో "రేయ్ అంటే "రేయ్" అన్న కేకలూ, "అమ్మా బాబోయ్!" అన్న అరుపూ, ఏ పి. డి 1584 కుడివైపు ముందు చక్రం క్రింద నుండి "అమ్మా" అన్న ఒకే ఒక ఆర్తనాదమూ, దాని వెన్నంటి అల్లంత దూరానికి యెగిరి వొచ్చిన వో కనుగుడ్డూ, చెల్లాచెదురుగా పడివున్న మైసూరుపాకు తుంపులూ, లడ్డు తుంపులూ, వినిపించేయి, కనిపించేయి.

రాకెట్‌లా యెదురువచ్చి నుదిటికి కొట్టు

కొని కిందపడిన మైసూరుపాక్ ముక్కకేసి చూస్తూ, "అమ్మో, సంగి కొడుకే" అని కన్నయ్య మనవడు లబ లబ లాడుతుండగనే ఛేర్మెన్‌గారు లోగిల్లోంచి హుటాహుటిన బయటకువచ్చేశారు వారివెన్నంటి వచ్చిన కన్నయ్యగారూ, తదితర పరివారమూ, ఏ. పి. డి 1584ను కోలాహలంగా చుట్టుముట్టేరు.

యెవరో టార్చిలైటు వేసేరు. యింకోరు పెట్రోమాక్స్ లైటు తెచ్చేరు.

"చూడండి" అన్నారు ఛేర్మెన్‌గారు గంభీరంగా.

టార్చి లైటు వాడూ, పెట్రోమాక్సు లైటువాడూ బండి ముందు చక్రం కిందికి వొంగి చూసేరు. "సరిగ్గా చక్రం క్రింద పడిందండీ తల" అన్నారు.

"ప్రాణం వుందా?"

"తల చితికి మెదడు యెళ్ళుకొచ్చింది-బాబూ, యింకెక్కడి పేనం?"

"సరే, యిహ వక్కకు వొచ్చేయండి. యిన్వెస్టిగేషన్ అయ్యేదాకా మీ రే మీ వేళ్ళు పెట్టి కెలక్కండి" అన్నారు ఛేర్మెన్‌గారు గంభీరంగానే. అంతట్లోనే అప్పుడే గుర్తుకు వచ్చినట్టు "అన్నట్టూ యెవరి పిల్లాడన్నారూ?" అన్నారు. కన్నయ్యగారు మనవడి మాట ఆయన స్పష్టంగానే విన్నారు. అయినా అడగడం ఆయన విధి కనుక అడిగారు. టార్చిలైటు వాడూ, పెట్రోమాక్సు లైటువాడూ ముఖ ముఖాలు చూసుకున్నారు.

కన్నయ్యగారు స్వచ్ఛందంగా ఆ అవకాశాన్ని వినియోగించుకొంటూ "మన సంగి కొడుకండీ" అని చెప్పేరు వుత్సాహంగా.

"సంగంటే?"- సంగి అంటే యెవరో తెలిక కాదు—మన పైరిమ్మినిస్టరు కొడుకండీ అన్నంత కలివిడిగా చెబుతోంటే, చిర్రెత్తి, అడ్డుపుల్ల వెయ్యాలని వేశారు ఛేర్మెన్‌గారు.

"అదే-మన ప్యూను శీనుగాడు లేడూ, వాడి కొడుకు." కన్నయ్యగారు 'మన'ను వొదిలేరు కారు.

"అరెరె!" అన్నారు ఛేర్మెన్‌గారు కాతర స్వరంతో, "అదా? యెంత పని జరిగిందీ? పిలవండి. పిలవండి, అది యింట్లోనో దొడ్లోనో వుండాలి. పిలవండి."

సమయానికి యిట్లా ప్రజల్ని కొట్టీ, పట్టీ, తట్టీ, కర్తవ్యాన్ని బోధించే నాయకులుండ బట్టి యీ మొద్దు దేశం యీమాత్రమైనా బతికి బట్ట గడుతోంది. అందాకా మొద్దు రాచ్చిప్పల్లా మొహాలు దించుకొని వున్న జనం వొక్క మారుగా కర్తవ్యాన్ని గుర్తించిన వారై దఫాకు పదేసి మంది చొప్పున యింట్లోకి దూరేరు.

యెక్కడో వంటింట్లో వున్న సంగి కబురు అందుకో కుండానే యేదో కీడు శంకించింది. యెట్లా వొచ్చి పండిందో సుడిగాలిలా లారీని చుట్టుకుంది. "అయ్యో! నా కొడుకా!? అని గుండెలు బాదుకుంది తల పట్టుకుంది. జుట్టు పీక్కుంది. లారీని కావిలించుకొని జారి మట్టిలో ముద్ద కడుతోన్న నెత్తురులో గిల గిలా కొట్టుకొంది. పది మందీ పట్టుకున్నారు. మరో వంద మంది పట్టు దొరక్క చుట్టుకొన్నారు. అయినా సంగి ఆగలేదు. పది మందినీ తనతోపాటు లారీ క్రిందకు లాక్కు పోవాలని గుంజుకుంది.

దాని వొంటి నిండా చెమట నెత్తురు పిల్చిన, మట్టిపూత కళ్ళనిండా నీళ్ళు, చేతుల నిండా పేరిన నెత్తురు, మొహం నిండా అట్టలు గట్టిన వెంట్రుకలు, గుండెల నిండా వెంకట్రావుడు—దాని వొళ్ళు గుడుసుళ్ళు పోతోంది.

దానినోరు తడారి పోయింది. గొంతు రాపిడి వారి పోయింది. గుండె బీటలు వారి పోయింది. ప్రాణం చివికి పోయింది.

చుట్టుకున్న జనం దాన్ని వొదల్లేదు. అదీ లారీక్రిందకు దూరి తన కొడుకును చూసుకోవాలన్న పట్టు వొగ్గలేదు. ఛేర్మెన్‌గారి గుండెలు బదా బదలైనాయి:

"ఇదుగో సంగీ! జరిగిందేదో, జరిగిపోయింది. చచ్చిన వాడు యేడిస్తే వొస్తాడా? మనకింతే ప్రాప్తమని సముదాయించుకోవాలి. దేవుడు మనకింతే రాసిపెట్టేడు ముందు జాగర్త లేకుండా యిప్పుడు లబ లబ లాడితే యేం లాభం? వాడిని రోడ్లంబడి వొదిలేసి యిప్పుడిట్లా అయిందనుకుంటే యెట్లా?"

అందాకా యీ చావులో తన పాత్ర యేమిటో గుర్తించ లేని సంగి శోకాలు తారస్థాయికి చేరేయి. "నిజమే బాబయ్యా! నేనే వాడిని సంపేసుకున్నాను బాబయా! ముదనష్టపుదాన్ని బాబయా! నేనూ దాని కిందే నస్తాను వొదలండి బాబయా! మీకు పుణ్యం వుంటుంది నన్నొదలండి బాబయా!" అంటూ యీడిగిల పడింది. అందిన ప్రతి కాలుకూ చుట్టుకొనిపోయి వెంకట్రావుని చంపినందుకు క్షమాభిక్ష వేడుకొంది.

"నాకొడుకును నన్ను ఒక్కసారి చూసుకోనీండి బాబయ్యా!" అని దణ్ణాలు పెట్టింది.

"వూరుకో, వూరుకో! చూద్దువుగానీలే. పోలీసులూ, బ్రేకిన్‌స్పెక్టరూ రిపోర్టు రాసుకుపోనీ. అందాకా బండిని కానీ, వాణ్ణి కానీ తగల గూడదు." అన్నారు వోదార్పుగా ఛేర్మెన్‌గారు.

అంతట్లోనే తన భుజస్కందాల మీద వున్న కార్య భారం గుర్తుకు వచ్చింది గావును, "అవునూ. ఆ డ్రయివరుగా డెక్కడ?" అనడిగేరు.

బండి వెనకాల్నుండి కాకీ యూనిఫాంలో కొంతా, వొళ్ళంతా పట్టిన చెమటల్లో మిగతా కూరుకుపోయిన తలవొకటి ఛేర్మెన్‌గారికి కాస్తంత యెడంగా నిలిచి వారి కాళ్ళ కడ్డంగా దభీమని పడిపోయింది.

"ఛీ, ఛీ!" అన్నారు ఛేర్మెన్‌గారు కాళ్ళను జాగ్రత్తగా వెనక్కు లాక్కుని: "చూశావురా దాని యేడుపు! మీదేం పోయింది? కళ్ళు మూసుకు బళ్ళుతోల్తారు. యేమన్నా అంటే కళ్ళు మూసుకునే కాళ్ళమీద పడతారు."

"లేదు బాబయ్యా!" అంది యూనిఫాం యింకా నేలమీది నీడల్లో ఛేర్మెన్‌గారి కాళ్ళకోసం దేవుళ్ళాడుతూ: "బండిటర్నింగ్ తిరుగుతూండంగా యెవరో తోసినట్లు బండి కిందకు వొచ్చి పడినారండీ. బ్రేకు కొట్టినా లాభం లేక పోయింది బాబయ్యా!"

"అవున్రా, వాడు నీ బండికిందే పడి చావాలని యిక్కడే కాచుక్కూచోని దూకి చచ్చేడు. అయినా నాకు తెలుసులే. మీరు యాక్సిడెంట్లు యిక్కడే యెందుకు చేస్తున్నారో! సత్తావుంటే నాతో ముఖాముఖి తేల్చుకోవాలి గానీ, ఇట్లా నోరులేని పిల్లల్ని, గొడ్లనూ, బండ్ల క్రిందకు తోసేస్తే లొంగి వస్తానను కున్నారా? వొరనని వొక్క నూరు యాక్సిడెంట్లు చేసినా నేను బతికుండగా మీ ఆటలు సాగుతాయా? అయినా యెవర్ది బండి?"


"సాంబాబుగోరిదండి బాబయ్యా!"

"యే సాంబాబురా"

"రాజోరి పాలెం సాంబాబూగోరి దండి"

అందాకా డ్రైవరుగాడి శరీర స్పర్శతో అపవిత్రం కాదల్చుకోని ఛేర్మెన్‌గారి యెడమ పాదం డ్రైవర్‌గాడి మొహాన్ని బలంగా సంభావించింది. "దొంగ ముండా కొడక! మీ లాంటి యెదవల్తో బంగారం లాంటి వోనర్లకు చెడ్డపేరూ, తిప్పలూను. బెల్లం కొట్టిన రాయల్లే వుండక పోతే యిందాకే నాతో ఆ కూత కూసి చావలేక పోయావ్. లెయ్. లెయ్ లేచి అట్లాచావు. మీ అయ్యగారి ఫోన్నెంబరెంతన్నావ్?" అంటూ హడావిడిగా డ్రైవర్ని వెంటేసుకొని యింట్లోకి వెళ్ళిపోయేరు ఛేర్మెన్ గారు

మరో పదినిముషాలకు సబిన్‌స్పెక్టరూ, బ్రేకిన్‌స్పెక్టరూ వొచ్చేరు. రాగానే ఛేర్మెన్ గారు వారిని తిన్నగా యింట్లోకి తీసు




కెళ్ళారు వొక్క అయిదు నిముషాల జనాంతిక సంభాషణలో విషయాలన్నీ వాటికి యెరుక పరిచి బయటికి తీసుకొచ్చేసేరు.

దరిమిలా ఛేర్మెన్‌గారు సంగిని కేకేసి చెప్పేరు. "యిదగో సంగీ! నేను యినస్పెక్టరు బాబుతో అన్నీ మాట్లాడేను. వో అయిదు నిముషాల్లో వాళ్ళు రిపోర్టు రాసుకుంటారు. తర్వాత నీవు శవాన్ని యింటికి తీసుకుపోవచ్చు. కారు సిద్ధం చెయ్యమని డ్రైవరుతో చెప్పేను. వాడిని కార్లో తిన్నగా యింటికి తీసుకుపో. నీ మొగుడికి గూడా చెప్పిపంపేను యిక్కడికే వస్తాడు. అదట్లా వుంచు. ముందు నీతో వొక సంగతి చెప్పాలి యిట్లారా."

"నా కొడుకు బతికుండగా రిక్షా అయినా యెక్కియెరగడు. చచ్చాకా కార్లెందుకులే బాబయ్యా. యీ చేతుల మీదనే మోసినాను. బతికుండగా లేనిది చచ్చినాక వాడు నాకు బరువౌతాడా? నాచేతల మీదనే తీసుకొని పోతాలే బాబయ్యా." వెక్కిళ్లు ఆపుకొంటూ అంది సంగి.

"అది నాకు తెలీదా యేం? యేదో పెద్దవాడిని. చెబుతున్నాను. వినాలి మరి. పోలీసులూ, గొడవలూ లేకుండా నేను చూస్తాగా."

"వొరే రాముడూ!" అంటూ సంగి రొమ్ములు బాదుకుందే తప్ప అక్కడి నుండి కదల్లేదు

ఛేర్మెన్‌గారు కార్యసాధకులు, యేశపులూ, పెద బొబ్బలూ వారిని కదిలించలేవు.

అటూ ఇటూ చూసేరు. పందిరి చివర్న నుంచోని శుభమా అని పెళ్ళి పెట్టుకుంటే- యిదేం పాడు శకునంరా బాబూ అని విసుక్కొంటోన్న భార్య కనిపించింది. వెంటనే ఆవిడ దగ్గరకు వెళ్ళి గుసగుసగా యేదో చెప్పేరు. ఆవిడ మెల్లగా సంగి దగ్గరకు వొచ్చి వీపున చెయ్యేసింది అనునయంగా. యెక్కడి నుండి వొచ్చిందో ఆమె ముహంలోకి వోప్పుట్టైకు దయవొచ్చిపడింది. "యిదుగో, సంగీ, నిన్ను చూస్తోంటే నా గుండె తరుక్కుపోతోందే. నాకూ తెలుసు కడుపుకోత. అయితే యేం చేసు

కోవాలట. నువ్విట్లా కాస్తా పక్కకురా."

"అమ్మగారూ" సంగి ఆవిడ కాళ్ళమీద పడి లబలబ లాడింది.

ఆవిడ గోవర్ధన గిరి లాంటి తన శరీరాన్ని చివ్వున వంచి, సంగి చేతుల్ని తన చేతుల్లోకి తీసుకొంది. దయనూ, అనుకంపనం మొహం మీదినుండి చెదరిన్వియకుండా కన్నీళ్ళలో, మట్టిలో, నెత్తురులో అట్టలు కట్టిన సంగిని లేవనెత్తి చుట్టూ చేతులు వేసి పొదువు కొంది. ఆక్షణంలో వాళ్ళను చూచిన వాళ్ళైనా వాళ్ళను అప్ప చెల్లెళ్లో, తోడి కోడళ్ళో అనుకోక తప్పదు. నెమ్మదిగా ఛేర్మెన్‌గారి భార్య అంగలో అడుగు వేసుకుంటూ, తన అడుగులో యీడిగిల బడుతోన్న సంగి అడుగు విధిగా పడేటట్లు సర్దుకుంటూ, వున్న శరీర భారానికి తోడూ, సంగి బరువునూ, అనంతమైన దుఃఖ భారాన్నీ మోసుకుంటూ, సంగిని తిన్నగా వసారాలోకి చేర్చింది.

కాచుకునివున్న ఛేర్మెన్‌గారు చేయాల్సిన హితబోధ చేసేరు. "నేను బండి వోనరుతో మాట్లాడేను. వాడు వెయ్యి రూపాయలు వెంటనే యివ్వడానికి వొప్పుకున్నాడు. యిప్పటి ఖర్చులకు నేనే వో వంద యిస్తాను. తీసుకో మిగతా విషయాలన్నీ నాకొదిలెయ్."

సంగి వోట్లో కొంగు దోపుకొని వెక్కింది తప్ప యేమీ మాటాడలేదు. సందేహంగా ఛేర్మెన్‌గారు వొక్క క్షణం దాని మొహంలోకి పరిశీలనగా చూసేరు. అందులో యేం పసి కట్టేరో కానీ గుండెల మీది బరువు దిగిపోయి నట్లుగా తృప్తిగా నిట్టూర్చేరు.

యింతట్లో ఛేర్మెన్‌గారి పెద్ద కూతురు గాభరాగా యింట్లోంచి వసారాలోకి వచ్చింది. "నాన్నా, సుధీర్ యింట్లో కనిపించడంలేదు నాన్నా!" అంది ఆందోళనగా.

"వాడు యిప్పుడు యింటో వుంటాడు టమ్మా సిపిచ్చిగానీ, ఆ గుంపులో యెక్కడో రాచకార్యాలు చక్కబెడుతూ వుంటాడు. ఆ సుబ్బగాణ్ణి వెదకమను." అన్నారు ఛేర్మెన్‌గారు ముఠపెంగా.

యింతలో పోలీసు కానిస్టేబుల్ వొచ్చేడు "సార్ శవాన్ని గుర్తించారట మీరు వొక్కమారు రావాలి."

"నేనెందుయ్యా. నేను చూసి భరించలేను. తల్లి గుర్తిస్తే చాలదా?" అని ఛేర్మెన్‌గారు అనేలోగానే సంగి రయ్యిన పరుగెత్తింది. "వోరె రాముడూ! నీకు భూమ్మీద అప్పుడే నూకలు చెల్లినయ్యిరా నాయినా!" అంటూ.

పెట్రోమాక్సు లైట్ల వెలుతురులో యెర్రటి మాంసం ముద్దగా, వికృతంగా మెరుస్తోన్న శవాన్ని చూడగానే సంగి టక్కున ఆగిపోయింది. కళ్ళు బేలగా భయం భయంగా లాకినీ, శవాన్ని మార్చి మార్చి చూసేయి.

శవం పక్కనే మోకాళ్ళ మీద కూచుని శవంకేసి దిగులుగా, గుబులుగా చూసింది. వెనకాలే అభయం యిస్తోన్నట్లుగా ఛేర్మెన్‌గారికేసి చూసింది. మళ్ళీ యెందుకో శవంకేసి చూసింది.

విసుగ్గా చుట్టకోసం జేబులు తడుము కొంటున్న ఛేర్మెన్ "యేమిటే, వెర్రి చూపులు చూస్తున్నావ్?" అన్నాడు.

సంగి ముద్ద ముద్దగా రాలిపోతున్న శవాన్ని కుదురుగా చేతుల్లోకి తీసుకుంటూ గొల్లుమంది. "యింత చిన్న వయసులో నీకు కడుపు కోత వచ్చింది గదే నాతల్లీ! సుజాతమ్మ తల్లీ!"

ఛేర్మెన్ చేతిలోని చుట్ట జారిపోయింది.

"నాన్నా, సుధీర్........" అంటోన్న ఛేర్మెన్ గారి కూతురు, సంగి తన పేరు పెట్టి దీర్ఘాలు తీయడం విని, యథాలాపంగా ఆ మాంసపు ముద్దకేసి చూసి తుపాకి గుండు తిన్నగా గుండెల్లో దిగిన గువ్వలా పొడిగా రాలిపోయింది.